

# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

18 ఆదివారం అక్టోబర్ 2026 | పేజీలు: 3


## జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఏడుదొడ్ల వెంకట్ రామ్ రెడ్డి




**నల్లగొండ- అక్టోబర్ 17( సత్యనిష్ఠ):** జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా పెద్ద సూరారం గ్రామానికి చెందిన ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోడరింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం కావడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డిలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇబ్రహీం, ఆర్టిఏ సభ్యుడు కూసుకుంట్ల రాజారెడ్డి, ఏదుళ్ళ మధుసూదన్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మోడరింగ్ కమిటీ సభ్యుడు పాదం అనిల్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## మృత్యువుకు దగ్గరగా వచ్చాం మార్పు మనలోనే

**బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం మండల కార్యదర్శి.**



**కోదాడ - అక్టోబర్ 17,)** మానవ జాతి మనుగడ కోసమై ఉన్న ఫలంగా “500” కోట్ల చెట్లు నాటవలసిన అవసరం ఉందనీ. లేకుంటే మానవ మనుగడ మృతులకు దగ్గరగా ఉందని తెలుస్తోందనీ నడిగూడెం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. ఈ వేసవి మామూలు వేసవి కాదు, ఈ రోజు బయట అడుగు పెడితే మాడి పోతున్నాం ఉదయం 9 గంటలకే రోడ్లు నిప్పులు కక్కుతున్నాయి, ఫ్యాన్ గాలి చాలటం లేదు, ఏసీ లేనిదే బతకలేం అనే స్థితికి వచ్చాం. కానీ మనం ఎంతకాలం ఏసీల ను ఆశ్రయిస్తాం? నిప్పులు కక్కుతున్న నిజాలు 1.ఉష్ణోగ్రత పెరుగుదల, భారత దేశంలో 45శీజ సాధారణం అయిపోయింది. రాజస్థాన్, విదర్భ లో 49శీజ దాటుతోంద నీ మా సన్నిహిత వర్గాల సమాచారం ద్వారా తెలుస్తోంది. 56శీజ వద్ద మానవ మెదడు పని చేయడం ఆగిపోతుం ది. 60శీజ కి చేరడానికి మనం చాలా దగ్గిరగా ఉన్నాము. 2.ఏసీ పరిష్కారం కాదు. ఒక ఏసీ బయటకు వదిలే వేడి 10 చెట్లను నరికినంత ప్రభావం చూపుతుంది. మనం చల్లదనం కోసం భూమిని ఇంకా వేడెక్కిస్తున్నాం. 3. చెట్లు ఎక్కడ? భారత దేశానికి ఇప్పుడు తక్షణం 500 కోట్ల చెట్ల అవసరం ఉంది. 1970లో 40% ఉన్న అటవీ విస్తీర్ణం, ఇప్పుడు 21% కి పడిపోయింది. మనం ఏం కోల్పోతున్నాం? ఒక పెద్ద చెట్టు రోజుకు “4” మందికి సరిపడా ఆక్సిజన్ ఇస్తుంది. 20 ఏసీలకు సమానమైన చల్లదనాన్ని ఇస్తుంది. భూగర్భ జలాలను పెంచుతుంది, వర్షాలను ఆహ్వానిస్తుంది. కానీ మనం అభివృద్ధి పేరుతో నిమిషానికి “15” చెట్లను నరుకుతున్నాం. అందులో విపరీతంగా తాటి చెట్లని నరకడం అత్యంత బాధాకరం, ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమేనా? కాదు. ప్రతి పౌరుడి బాధ్యత. ఒక చెట్టు పెరిగి నీడ ఇవ్వడానికి “5 నుండి 7 ఏళ్లు” పడుతుంది, అంటే మనం ఈ రోజు నాటితే, 2032 లో ఫలితం చూస్తాం. ఇంకా ఆలస్యం చేస్తే, 60శీజ భూమిని మన పిల్లలకు అప్పగిస్తాం. ఇప్పుడేం చేయాలి? ఇదే సరైన సమయం. ఇప్పుడు వర్షాకాలం మొదలైంది. భూమి తడిగా ఉంది. మొక్క నాటడానికి ఇదే సరైన సమయం. మీరు చేయాల్సింది కేవలం 2 విషయాలు 1.ఈ వర్షాకాలంలో ప్రతీ మనిషి, 2 రెండు మొక్కలు చొప్పున నాటండి. మీ ఇంటి ముందు, స్కూల్లో, ఖాళీ స్థలంలో ఎక్కడైనా. వేప, రావి, మర్రి, చింత లాంటి దేశీయ చెట్లు నాటండి. 2.నాటిన మొక్కను చంపు కోకండి. నీళ్లు పోయండి, కంచె వేయండి. అది బతికేలా చూడండి. మనం మారక పోతే, ప్రకృతి మనల్ని మార్చేస్తుంది. ఆ మార్పు “మృత్యువు” రూపంలో ఉంటుంది లేదా చూడాల్సి వస్తుంది. ఏసీ రిమోట్ పక్కన పెట్టి, ఒక పార పట్టుకోండి. మీ పిల్లల ఊపిరి కోసం, ఈ భూమి కోసం ఈ రోజే ప్రతీ ఒక్కరు రెండేసి (2) చెట్లు చొప్పున నాటండి. “ప్రతి ఇంటికి రెండు చెట్లు - ప్రాణం పోసే పని” మనలను మనమే కాపాడుకొంటూ భావితరాలను కూడా కాపాడుకుందాము. ఉద్యోగులు, మేధావులు యువకులు మహిళలు పిల్లలు అన్ని ప్రభుత్వ ప్రభుత్వ సంస్థలు నడుం బిగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆహ్వానిద్దాం పండుగ వాతావరణంలో మొక్కలు నాటుకున్న మానవ వాలిని కాపాడుకుందాం అంటూ రైతు సంఘం నేత, బెల్లంకొండ సత్యనారాయణ కోరారు.

## దేవరకొండ మండలంలో అటవీ సంపద విధ్వంసం

**కొండ భీమనపల్లి శివారులో టన్నుల కొద్దీ అక్రమ బొగ్గు తయారీ**



**దేవరకొండ-అక్టోబర్ 17 (సత్య నిష్ఠ):** దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామ శివారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి కొంతమంది మాజీ ఎంపీటీసీ జెడ్పీటీసీ సర్పంచుల సహకారంతో మండల అధికారుల అండదండలతో విచ్చలవిడిగా అటవీ సంపద అయిన చెట్లను నరికి టన్నుల కొద్దీ బొగ్గును ఉత్పత్తి చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు దీనిని ప్రశ్నించిన ప్రజలను బెదిరించడం వినని వారిపై తన అనుచరులతో దాడులు చేయించడం ద్వారా తన అక్రమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాడు. అతన్ని అడ్డుకోవాల్సిన అటవీ అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు వెంటనే జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఈ అక్రమాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో నీటి కుంటలు నింపడం జరిగింది





**సత్యనిష్ఠ: తిరుమలగిరి సాగర్:** తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని రంగుండ్ల గ్రామపంచాయతీ పాశవారిగూడెం పరిధిలోని మంచాలకుంట చెరువు గత నెల రోజులుగా నీళ్లు లేక ఖాళీ అయినది. ఆ యొక్క విషయాన్ని పాశశీ వారి గూడెం ప్రజలు, గ్రామ యువత మరియు మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్ మరియు సర్పంచ్ మొదలగు వారుఎమ్మెల్యే గారికి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి వెంటనే స్పందించి అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి మంచాల కుంటలో నీటిని పూర్తిగా నింపే వరకు నీటిని విడుదల చేయాలని చెప్పడం జరిగింది.. నీటిని నింపడం ద్వారా బోరు బావులలో నీటి ఉత్పత్తి పెరిగి, సూపర్ ఏలినో నుంచి పంటలను కాపాడుకోవచ్చు. దీని ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీటికి మరియు పంటలకు నీళ్ల విడుదల చేసినందుకుగాను పాశం వారి గూడెం ప్రజలు ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి కి, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్ గార్కి, సర్పంచులకు దీనికి సహకరించిన పెద్దలకు గ్రామ యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## దేవరకొండలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**దేవరకొండ-అక్టోబర్ 17 (సత్యనిష్ఠ):** దేవరకొండ పట్టణం లోని మున్సిపాలిటీ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముందుగా గౌరమ్మ పూజ నిర్వహించి, బతుకమ్మ లను అందంగా అలకరించి ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ రామ దుర్గా రెడ్డి, కౌన్సిలర్లు ఆర్ ఎమ్ స్టాఫ్ మరియు మున్సిపల్ సిబ్బంది పాలుగోన్నారు.

## గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీలో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి

- జ్యోతిబాపూలే విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన కన్వీనర్ జాజుల లింగం గౌడ్



హైదరాబాద్- అక్టోబర్ 17 (సత్యనిష్ఠ): తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా దామాషా ప్రకారం వారికి రాజకీయ వాటా కల్పించాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.వచ్చే నెలలో భర్తీ అయ్యే గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీలో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హత అనుభవం ప్రజాసేవ అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేసినటువంటి బీసీ నాయకులకు పదవులు కేటాయించాలని దీని ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. పదవులన్నీ కేవలం ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం సరికాదన్నారు నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు గజ మహేష్ బంటు సైదులు రాంబాబు యాదవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

- కట్టంగూరు సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్
- జలజీవన్, మిషన్ జల మహోత్సవంలో ప్రజలకు అవగాహన




కట్టంగూర్-అక్టోబర్ 17 ( సత్య నిష్ఠ): నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ ప్రజలకు సూచించారు. జలజీవన్ మిషన్ జల మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఆమె అధికారులు పాలకవర్గ సభ్యులతో కలిసి నీటిని వృథా చేయకుండా పొదుపు వాడుకోవాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు నీటి పొదుపు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీరు విలువైన వనరని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ గుండు రాంబాబు కార్యదర్శి శ్రావణ్ యర్కాల శశీ శ్రీరామ్ సంధ్య వీరేశ్ మైనం ఉమ అంబేద్కర్ ఎకుల సుజాతా ఏనుగు సైదులు పుల్కారం శ్రీను గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనేతరుల రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలి

- **అన్ రిజర్వ్‌డ్ స్థానాల పేరుతో గిరిజనేతరులను ప్రోత్సహిస్తే ఊరుకోం**
- **ఆదివాసి మహిళలను అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం**
- **గడుపుకోవాలనుకుంటున్న నాన్-ట్రైబల్స్ పన్నాగాలు**
- **ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను హెచ్చరిక**



**రంపచోడవరం-సత్యనిష్ఠ** పోలవరం జిల్లా ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు పన్నుతున్న రాజకీయ ఎత్తుగడలపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం నాడు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పూర్తి రాజకీయ హక్కులు స్థానిక ఆదివాసీలకే దక్కాలని, కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 'అన్ రిజర్వ్‌డ్' స్థానాల పేరుతో గిరిజనేతరులను ఏజెన్సీలోకి పరోక్షంగా ప్రోత్సహించడం రాజ్యాంగ హక్కులను గిరిజనేతరులకు దోచిపెట్టడమే నని ఆయన ధ్వజమెత్తారు. అన్ రిజర్వ్‌డ్ స్థానాల్లో అన్ని వర్గాల వారు పోటీపడే అవకాశం ఉన్నప్పటికీ, అవకాశాల కోసం కాచుకుని కూర్చునే గిరిజనేతరులు ఈ అవకాశాన్ని వాడుకుని రాజకీయ ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నారని శ్రీను మండిపడ్డారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వంద శాతం స్థానాలను ఆదివాసులకే కేటాయించే దమ్ము ప్రధాన రాజకీయ పార్టీలకు ఉందా అని ఆయన నిలదీశారు. రాజకీయ పార్టీలలో కొనసాగుతున్న ఆదివాసీ నాయకులు ఈ కుట్రలను గుర్తించి ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరోవైపు, 70 శాతం స్థానిక సంస్థల స్థానాలలో 50 శాతం షెడ్యూల్డ్ ప్రాంత మహిళలకు కేటాయించడం గొప్ప విషయమే అయినప్పటికీ, అక్కడ కూడా కొందరు గిరిజనేతరులు కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఆదివాసి మహిళలను వివాహం చేసుకుని, వారి ముసుగులో ట్రైబల్స్ నీ ఎన్నికల బరిలోకి దింపుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, గెలిస్తే పదవి మహిళ పేరున ఉన్నప్పటికీ అధికారం మాత్రం గిరిజనేతరుల చేతుల్లోనే ఉంటుందని హెచ్చరించారు. కాబట్టి ఆదివాసి సమాజం మేలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాలలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్ తదితర అన్ని స్థానాలు పూర్తి స్థాయిలో ఆదివాసులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరుల ముసుగులో పోటీ చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండి, కేవలం అసలైన ఆదివాసులను మాత్రమే గెలిపించుకోవాలని కోరారు. ఏజెన్సీ చట్టాల అమలు కోసం పోరాడేందుకు యువతకు ఇదొక మంచి తరుణమని, ప్రభుత్వాలు ఎన్నికల హామీల ప్రకారం జీవో నంబర్ 3కి ప్రత్యేక చట్టాలు తెస్తామని, 1/70చట్టం అమలుకు సుప్రీంకోర్టులో కౌంటర్ వేస్తామని చెప్పి మోసం చేశాయని విమర్శించారు. నిన్న మొన్నటి వరకు హక్కుల కోసం రోడ్డెక్కిన నిరుద్యోగ యువత, ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రభుత్వాల, మరియు అన్ని రాజకీయ పార్టీల, పోటీలో ఉండే అభ్యర్థుల వైఖరికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఓట్లు అడగడానికి వచ్చే ప్రతి ఒక్క రాజకీయ నాయకుని దగ్గరి నుంచి ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామనే హామీతో వాంగ్మూలం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు మోడీ నూకరాజు, ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్, బల్లెం గంగాభవాని, శారదాదేవి, శివరాం, కృష్ణ, ఏడుకొండలు రావు దొర, కలవల ప్రసాద్ దొర, అనిక శ్రీను, కాలిం కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి డిండి ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శిలి తుమ్మల వీరారెడ్డి**



**నల్లగొండ --అక్టోబర్ 17 (సత్యనిష్ఠ):** మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పాలమూరు రంగారెడ్డి డిండి ఎత్తిపోతల పథకాలను చేపట్టడం సాగునీరు అందించా లని లక్ష్యంతో రాష్ట్ర మంత్రివ ర్గం నిర్ణయించింది. దీనికి భిన్నంగా మహబూబ్నగర్ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు పార్లమెంట్ సభ్యులు ఇతర రాజకీయ పార్టీలు మంత్రివర్గ నిర్ణయానికి భిన్నంగా నార్లపురం నుంచి తీసుకెళ్లాలని ప్రతిపాదిం చడం తీవ్రమైన అభ్యంతరాన్ని సిపిఐ ఎం నల్గొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తీవ్రంగా ఖండిస్తు న్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగునీరు తాగునీరు అందించాల్సిన డిండి ఎత్తిపోతల పథకానికి దేవరకొండ మునుగోడు నియోజకవర్గం నీటిని సేకరించాలని లక్ష్యంతో ఈ పథకాలకు డిజైన్ చేశారు. ఇప్పుడు నార్లపూరు-ఏదుళ్ళ మధ్యన మహబూబ్నగర్ ప్రజా ప్రతినిధులు అడ్డంగా మాట్లాడటం నల్గొండ జిల్లా ప్రజల తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలియజేస్తున్నాం. ఇప్పటికే గత ప్రభుత్వం నీటిపారుదల రంగ నిపుణుల సూచనలతో పాలమూరు రంగారెడ్డి డిండి ఎత్తిపోతల పథకాలకు రెండిటికి కలిపి శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున 60 వరద రోజులలో నీటిని తరలించాలని నిర్ణయించారు. వచ్చే నీటిలో ప్రతిరోజు వన్ పాయింట్ ఫైవ్ జీరో టీఎం సి చొప్పున 90 టీఎంసీలు పాలమూరు ఎత్తిపోతలకు జీరో పాయింట్ ఐదు జీరో టీఎంసీలు చొప్పున 30 టీఎంసీల నీటిని డిండికి కేటాయించాలని నిర్ణయిం చారు. దీని ప్రకారం పనులు ప్రారంభించారు. శివన్న గూడెం కిష్టరాంపల్లి సింగరాజుపల్లి గొట్టిముక్కుల జలాశయాల నిర్మాణ పనులు పూర్తి అయినాయని తుమ్మల వీరారెడ్డి అన్నారు. 1800 కోట్ల రూపాయలతో మంత్రివర్గంలో నిర్ణయించి పరిపాలన అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలిచి ఒప్పందాలు కూడా పూర్తయినవి అన్నారు. ఇంకా భూసేకరణ జరగకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. నీళ్లు నిధులు నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం కోసం పాలమూరు ప్రజా ప్రతినిధులు ఇతర రాజకీయ పార్టీలు అడ్డంగా మాట్లాడటం క్షమించరని నల్లగొండ జిల్లా ప్రజల తరపున సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది.నల్లగొండ జిల్లా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రులు జిల్లా ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేయటానికి యుద్ధ ప్రాతిపదికంగా పనులు చేయడానికి ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదు. లేదంటే మీరు జిల్లాకు తీరని అన్యాయం చేసినట్లుగా మిగిలిపోతారని తెలియజేస్తు న్నాం. ఈ జిల్లాకు నీటి జలాలు కేటాయింపులో ఏ ఒక్క టీఎంసీ తగ్గిన మేము ఒప్పుకునేది లేదని చెప్పేసి తెలియజేస్తున్నాం. మహబూబ్నగర్ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన నిర్ణయాన్ని మీరు నార్లాపూర్ నుంచి తరలించాలని తగులాట పెట్టడం సరి అయింది కాదని తెలియజేస్తున్నాం. డిండి ఏదుళ్ళ అనుసంధానం పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధం కావాలని తెలియజేస్తున్నాం. లేనియెడల నీటి కొట్లాటలు అది యుతంగా మారకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతున్నాం. మీరు ఒక జిల్లాకు ముఖ్యమంత్రి కారు మీరు సమత్రుల్యంతో ఈ జిల్లా ప్రజలను కూడా చూడాలి ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి మీరు ముఖ్యమంత్రి కావడానికి ఉపయోగపడ్డారు. అది మర్చిపోకండి ఈ జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తే మిమ్మల్ని పాతర వేస్తామని సిపిఎం పార్టీగా హెచ్చరిస్తున్నాం. ఈ జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను రైతులను సమీకరించి ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. పార్టీలు ప్రజాసంఘాలు మేధావులు అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.